బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ నివాళి

నాగయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

అర్వపల్లి, మే 7: మండల పరిధిలోని పర్సాయిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మర్రిపెల్లి నాగయ్య ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బుధవారం పర్సాయిపల్లి గ్రామానికి వెళ్లి నాగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేష్, నాయకులు భరత్‌రెడ్డి, మిర్యాల వెంకన్న, యుగేందర్, నరసయ్య, రామలింగయ్య, సురేశ్, వెంకన్న తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య

నూతనకల్, మే 7: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కలెంచర్ల వీరయ్య, కలెంచర్ల లింగయ్య బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్న మల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైనందని, అందుకే ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మున్న లింగయ్య, ఉప్పుల వీరుయాదవ్, వెంకటయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

అర్వపల్లి, మే 7: మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన జూలూరి మహేశ్ (27) మంగళవారం గేదెలను మేత కోసం గ్రామంలోని చెరువు వైపు తోలుకెళ్లాడు. సాయంత్రమైనా మహేశ్ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా మహేశ్ చెప్పులు కనిపించాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా చెరువులో గాలింపు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. చెరువులోకి దిగిన మహేశ్ ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడని ఎస్ఐ తెలిపారు. మహేశ్ తండ్రి పున్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

'పది'లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ సలీంషరీఫ్

కోదాడ రూరల్, మే 7: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులను జమాతే ఇస్లామీ హింద్ కోదాడ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కోదాడ పట్టణ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సలీంషరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులోనూ బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం డి.మార్కండేయ, జమాతే ఇస్లామీ హింద్ సంస్థ కోదాడ పట్టణ అధ్యక్షుడు ఖాజామియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం అక్రమంగా తరలిస్తే చర్యలు : సీఐ చరమందరాజు

రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న సీఐ చరమందరాజు

మఠంపల్లి, మే 7: ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రానికి ధాన్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు హెచ్చరించారు. మండల పరిధిలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును బుధవారం ఆయన తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బోనస్ అందజేస్తున్నందున కొందరు ఏపీ నుంచి ధాన్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మఠంపల్లి ఎస్ఐ పి.బాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు : ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

మునగాల, మే 7: మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలను నడపొద్దని సూచించారు. హెల్మెట్ ఉంటే ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని, స్వల్ప గాయాలతో బయటపడొచ్చని పేర్కొన్నారు. కారు నడిపే వారు తప్పకుండా సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

● తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, మే 7: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా నేటికీ పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మిల్లుల వద్ద ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేయాలని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో ఒక లారీకి 14 క్వింటాళ్ల ధాన్యాన్ని రైతుల నుంచి బలవంతంగా తీసుకుంటున్నారని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు.

'లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'

అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సూర్యాపేట టౌన్, మే 7: కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ నాయకుడు కాసాని పాపయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు దంతాల రాంబాబు, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల సైదులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జాతీయ కార్మిక సంఘాల సమ్మె సన్నాహక సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలకు ప్రజా, అటవీ సంపదను కట్టబెట్టే ఆలోచన తప్ప ప్రజా సమస్యలు పరిష్కరించే ఆలోచన ప్రధాని మోదీకి లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మేకల శ్రీనివాస్, ప్రసాద్, కాసర్ల శ్రీనివాస్, గంట నాగయ్య, నెమ్మాది వెంకటేశ్వర్లు, శ్యామల అశోక్, ఎస్.రాఘవరెడ్డి, సైదులు, ముత్యాలు, సోమయ్య, సాయికుమార్, ముస్తఫా, శ్రీను, రవి, వెంకట్, మధు, నర్సిరెడ్డి, రామ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

సూర్యాపేట, మే 7: జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసు నమోదు చేసి జరిమానా విధించడంతో పాటు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం 15 రోజుల్లో తాసీల్దార్లు, ఎంపీడీఓలతో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇటుక బట్టీలు, ఫ్యాక్టరీలు, దుకాణాల్లో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించాలని చెప్పారు. మున్సిపాలిటీలలో కమిషనర్లు బాల కార్మికులను వివరించారు. గ్రామ పంచాయతీల్లో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాలు బాల కార్మికులను గుర్తించి మండల టాస్క్‌ఫోర్స్ కమిటీకి తెలియజేయాలని కోరారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్‌డీఓ అప్పారావు, డీపీఓ యాదగిరి, డీడబ్ల్యూఓ నరసింహారావు, రమణారావు, డాక్టర్ కోటాచలం, సీతారాం నాయక్, శ్రీధర్‌రెడ్డి, రేణుక పాల్గొన్నారు.

31 మంది ఏఎస్ఐల బదిలీ

● కౌన్సిలింగ్ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ నరసింహ

బదిలీ అయిన సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మే 7: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తూ మూడేండ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 31 మంది ఏఎస్ఐలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎస్ఐలు కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చామని, అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు సేవ లందించాలని దిశా నిర్దేశం చేశారు. స్టేషన్ల పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి నిరోధించడంలో కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, అడ్మిని స్ట్రేషన్ అధికారి మంజుభార్గవి, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ భరోసా

మునగాల: ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించేందుకే పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ నరసింహ పేర్కొన్నారు. మండలంలోని నరసింహులగూడెం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. ప్రజల భద్రత, న్యాయం కోసం పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు. గ్రామాల్లో కక్షలకు పోయి జీవితాలను ఆగం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తూకంలో తేడాలు వస్తే చర్యలు

● అదనపు కలెక్టర్ రాంబాబు

వట్టిఖమ్మంపహాడ్ కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంల, మే 7: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు వేసేటప్పుడు తూకంలో తేడాలు వస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ రాంబాబు హెచ్చరించారు. మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్, అక్కలదేవిగూడెం, వాల్యాతండాల్లోని కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీసీ వెంకన్న, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు గోగుల శిరీష, మల్లేశ్వరి, శైలజ, ప్రియాంక, గురువమ్మ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

● ఆర్డీఓ శ్రీనివాసులు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గరిడేపల్లి, మే 7: భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని గరిడేపల్లి, కుతుబ్‌షాపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన సదస్సుల్లో ఆయన పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు. భూ సమస్యలపై గరిడేపల్లిలో 193, కుతుబ్‌షాపురంలో 140 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో తాసీల్దార్ కవిత, డీఏఓ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ చలికంటి నరేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, రాంబాబు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

అనంతగిరి, మే 7: పేద ప్రజల సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సీపీఐ మండల మూడో మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే పాలకులు సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకానికి, వ్యవసాయ, కార్మిక రంగాలకు బడ్జెట్‌లో నిధులను తగ్గించడం వలన దేశం ఏ రకంగా అభివృద్ధి చెందుతుందో పాలకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. అనంతరం 15 మందితో మండల నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. మహాసభలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, బత్తినేని హనుమంతరావు, డేగ వీరయ్య, బత్తిని నాగేశ్వరరావు, వీరబాబు, నూకల శ్రీను, వాకపు పుల్లారెడ్డి, బానోతు కోటేశ్వరరావు, యరసాని రవి తదితరులు పాల్గొన్నారు.

'మిల్లర్ల దోపిడీతో నష్టపోతున్నాం'

ఏపీఎం మంజుల ఎదుట తమ గోడు వెల్లబోసుకుంటున్న రైతులు

ఆత్మకూర్.ఎస్, మే 7: మిల్లర్ల దోపిడీతో తాము నష్టపోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పాతర్లపహాడ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం మంజుల, సీసీ సుధాకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వారి ఎదుట తమ ఆవేదనను వ్యక్తం చేశారు. పాతర్లపహాడ్ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి జనగాంలోని రైస్ మిల్లులకు తరలించిన ధాన్యంలో ఏదో ఒక తిరకాసు పెడుతున్నారని, తరుగు కింద దోచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సెంటర్ నుంచి ఇప్పటి వరకు 9 లారీల ధాన్యం జనగాం రైస్ మిల్లుకు తరలించగా ప్రతి లోడులో తేమ, తాలు సాకుతో 5 నుంచి 6 క్వింటాళ్ల ధాన్యాన్ని దోచేస్తున్నారని రైతులు ఆరోపించారు. కంప్యూటర్ కాంటాలతో తూకం వేసిన ధాన్యాన్ని వేబ్రిడ్జి తూకాల్లో తేడాలు చూపిస్తూ రైతులను దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'న్యాయవాదుల శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి'

నేరేడుచర్ల, మే 7: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న న్యాయవాదుల రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా నాయకుడు, న్యాయవాది చిత్రం విశ్వనాథం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. శిక్షణ తరగతుల్లో నూతన చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కోదాడ రూరల్, మే 7: మండల పరిధిలోని అడ్లూరు గ్రామ శివారులో కోదాడ, మేళ్లచెర్వు ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎర్రపరం గ్రామానికి చెందిన సూరేపల్లి గోవిందరావు కోదాడ నుంచి గ్రామానికి వెళ్తుండగా మేళ్లచెర్వు నుంచి కోదాడ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గోవిందరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో గోవిందరావును 108 అంబులెన్స్‌లో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

వెలిదండలో మేడే వార్షికోత్సవం

గరిడేపల్లి, మే 7: మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మేడే వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి మేకల కనకారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, మాజీ సర్పంచ్ మాశెట్టి అంజయ్య, ఉదయగిరి, పెద్ద సాంబయ్య, నాగేశ్వరరావు, నారాయణ, గుండు నగేశ్, పర్వతాలు, బ్రహ్మయ్య, కామళ్ల శ్రీను, నరేశ్, లక్ష్మయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

అర్వపల్లి, మే 7: మండల పరిధిలోని సూర్యనాయక్ తండాకు చెందిన లూనావత్ నరసింహ అనే రైతుకు చెందిన గేదె బుధవారం వ్యవసాయ బావి వద్ద మేత మేస్తూ ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌కు తగిలి మృత్యువాతవాత పడింది. గేదె విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని రైతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల బడిబాట

తుంగతుర్తి, మే 7: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయురాలు వెంకట్రామనర్సమ్మ అన్నారు. మండల పరిధిలోని వెంపటి గ్రామంలో ఎంపీపీఎస్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో బుధవారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాలకుర్తి ఎల్లయ్య, మల్లేపాక రవీందర్, జీడి అనిల్, గట్టు మాధవి, నవీన్, భవాని తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి'

మోతె, మే 7: పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు ప్రజలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బురకచర్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన మేడే వారోత్సవాల్లో ఆయన పాల్గొని సీపీఎం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కక్కిరేణి సత్యనారాయణ, రెడ్డిమల ఇందిర, కొండా రాములు, కొండ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నాగారం, మే 7: మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

● ఎంఈఓ వెంకట్‌రెడ్డి

శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి

మేళ్లచెర్వు, మే 7: తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో క్రీడలు, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకట్‌రెడ్డి అన్నారు. మేళ్లచెర్వు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 15 రోజుల పాటు నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, గేమ్స్, సాంస్కృతిక అంశాలు, స్పోకెన్ ఇంగ్లిష్, గణితం పజిల్స్, సైన్స్ ప్రయోగాల వంటి అంశాలపై వలంటీర్లు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కాగా, రామాపురం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రాములు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు నారపరెడ్డి, సత్యప్రసాద్, నరసింహారావు, రమేశ్, ఉపేందర్, రషీద్, కోటేశ్వర్‌రావు, రవీంద్రరావు, పిన్ని మధు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి మండలంలో..

గరిడేపల్లి: గరిడేపల్లి, పొనుగోడు, కీతవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ చక్రునాయక్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో హెచ్ఎంలు, శిక్షణ శిబిరం ఇన్‌స్ట్రక్టర్లు, సీఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఎం.సువర్ణ, నర్సకుమారి, ఇన్‌స్ట్రక్టర్లు కె.ధనమ్మ, అంబేద్కర్, ఎ.బాలు, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్‌కుమార్, జి.వెంకటేశ్వర్లు, ఉమ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్

గరిడేపల్లి, మే 7: దేశ భవిష్యత్ కమ్యూనిస్టులపైనే ఆధారపడి ఉందని, రానున్న రోజుల్లో ఎర్రజెండాకు పూర్వ వైభవం రావడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన వెలిదండ, రంగాపురం గ్రామాల సీపీఐ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. అర్హులైన వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీని విస్మరించారని పేర్కొన్నారు. అనర్హులకు సైతం ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని ఆరోపించారు. యువతకు విద్య, ఉద్యోగాల హామీని అమలు చేయడం లేదన్నారు. తిరగమళ్ల కిరణ్, మామిడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మహాసభలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, పోటు పూర్ణచందర్‌రావు, కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, మామిడి శ్రీనివాస్, ప్రధాని సైదులు, కట్ట అశోక్, సుందరయ్య, కృష్ణబాబు పాల్గొన్నారు.

'దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి'

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హుస్సేన్

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న హుస్సేన్

హుజూర్‌నగర్ రూరల్, మే 7: రైతాంగ, ప్రజా సమస్యల పరిష్కారానికి, ఉపాధి హామీ పథకం రక్షణ కోసం ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోసనబోయిన హుస్సేన్ పిలుపునిచ్చారు. ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అమరవరం గ్రామంలో పర్యటించి ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు బడ్జెట్‌లో రూ.2.50 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని, కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర